సాక్షి నల్లగొండ

ఆదివారం । 8 । జూన్ । 2025



బారులుదీరిన భక్తులు
యాదగిరిగుట్టకు శనివారం భక్తుల రద్దీ పెరిగింది. 40వేలకు పైగా భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. - 10లో



ఆర్థిక స్వావలంభనే లక్ష్యం
రైతులు పండించిన పంటలకు మార్కెటింగ్ కల్పించేందుకు పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఎఫ్‌పీఓలు ఏర్పాటు చేస్తున్నారు. - 10లో



కేసీఆర్‌ను తిట్టడానికే సీఎం సభ
మాజీ సీఎం కేసీఆర్‌ను తిట్టడానికే ఆలేరులో సీఎం సభ పెట్టారని మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య ఆరోపించారు. - 10లో

న్యూస్‌రీల్

నేడు శాలిగౌరారం ప్రాజెక్టు నీటి విడుదల

శాలిగౌరారం : జిల్లాలో మధ్యతరహా ప్రాజెక్టుల్లో ఒకటైన శాలిగౌరారం ప్రాజెక్టు నుంచి ప్రస్తుత వానాకాలం పంటల సాగుకు ఆదివారం నీటి విడుదల చేయనున్నట్లు నీటి పారుదలశాఖ డీఈ సత్యనారాయణ శనివారం సాయంత్రం తెలిపారు. నీటి విడుదల కార్యక్రమానికి భువనగిరి పార్లమెంట్ సభ్యుడు చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ ముఖ్య అతిథులుగా హాజరవుతున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి మండల ప్రజాప్రతినిధులు, రాజకీయ పార్టీల నాయకులు, రైతుప్రతినిధులు హాజరు కావాలని కోరారు. కాగా.. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి మట్టం 21 అడుగులు కాగా.. ప్రస్తుతం 18 అడుగుల మేర నీరు ఉంది. ప్రాజెక్టు కింద మండలంలోని తొమ్మిది గ్రామాల పరిధిలో సుమారు 5 వేల ఎకరాలకు సాగునీరు అందనుంది.

రైతు భరోసా విడుదల చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న రంగారెడ్డి

నల్లగొండ టౌన్ : రైతు భరోసా నిధులను వెంటనే విడుదల చేయాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జూలకంటి రంగారెడ్డి డిమాండ్ చేశారు. సీపీఎం జిల్లాస్థాయి రాజకీయ శిక్షణ తరగతుల ముగింపు సందర్భంగా ఆయన శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటివరకు రైతు భరోసా విడుదల చేయకపోవడంతో రైతులు వడ్డీ వ్యాపారులను ఆశ్రయించి పంటలను సాగు చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎరువులు, విత్తనాలు, పురుగుల మందులు అందుబాటులో ఉంచాలని నకిలీ విత్తనాలను పురుగుల మందులను అరికట్టాలని కోరారు. సమావేశంలో పార్టీ జిల్లా కార్యదర్శి తుమ్మల వీరారెడ్డి, ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి, పాలడుగు నాగార్జున, ఐలయ్య, డబ్బికార్ మల్లేష్, పాలడుగు ప్రభావతి, సయ్యద్ హాసం, చినపాక లక్ష్మీనారాయణ, వీరేపల్లి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

సంస్థాన్ నారాయణపురం: మునుగోడు ప్రజల సమస్యలపై ఎమ్మెల్యే స్పందించి పరిష్కరించాలని బీజేపీ నల్లగొండ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ నాగం వర్షిత్‌రెడ్డి అన్నారు. శనివారం సంస్థాన్ నారాయణపురంలో పార్టీ మండల శాఖ అధ్యక్షుడు సుర్వీరాజుగౌడ్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎమ్మెల్యేకు ఏమైనా ఎన్నికలు వచ్చినప్పుడు ప్రజలు గుర్తుకు వస్తారన్నారు. సాగు నీరు లేక ఈ ప్రాంత రైతులు, రైతు కూలీలు హైదరాబాద్‌కు వలస వెళ్లారని ఆవేదన వ్యక్తం చేశారు. సమావేశంలో పార్టీ నాయకులు దోనూరు వీరారెడ్డి, సోమ నరసింహ, బచ్చన బోయిన దేవేందర్, జక్కలి రాజు, దర్శనం వేణు, భాస్కర నరసింహ, వంగరి రఘు, సూరపల్లి శివాజీ, నందగిరి పాల్గొన్నారు.

● త్యాగానికి ప్రతీక.. బక్రీద్





బక్రీద్ పండుగ సందర్భంగా నల్లగొండలోని ఈద్గా వద్ద ముస్లిం మత పెద్దను కలిసిన మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

నల్లగొండలోని ఈద్గా వద్ద నమాజ్‌లో పాల్గొన్న ముస్లింలు

బందోబస్తును పరిశీలించిన ఎస్పీ



నల్లగొండలో బందోబస్తును పరిశీలిస్తున్న ఎస్పీ శరత్‌చంద్ర పవార్

నల్లగొండ : బక్రీద్ పండుగ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఎస్పీ శరత్ చంద్ర పవార్ తెలిపారు. శనివారం నల్లగొండలోని మసీదులు, ఈద్గాల వద్ద ఏర్పాటు చేసిన పోలీస్ బందోబస్తును ఆయన పర్యవేక్షించి మాట్లాడారు. ప్రజలకు ట్రాఫిక్ ఇబ్బందులు కలగకుండా ట్రాఫిక్ డైవర్షన్ పాయింట్స్, అవసరమున్న చోట పోలీస్ పికెట్లు ఏర్పాటు చేశామని తెలిపారు.

ఇందిరమ్మా.. ఇదేమిటమ్మా!

ఇళ్ల నిర్మాణానికి నిబంధనల చిక్కులు

- 600 చదరపు అడుగుల్లోనే నిర్మించుకోవాలంటున్న అధికారులు
- అంతకు మించితే బిల్లులు ఇవ్వమని స్పష్టీకరణ
- పైలెట్ ప్రాజెక్టు కింద ఎంపికైన గ్రామాల్లో కొంత సడలింపు
- అయోమయంలో లబ్ధిదారులు
- నిబంధనల ప్రకారం నిర్మిస్తున్నవీ నత్తనడకనే..



600 ఎస్ఎఫ్‌టీలోపు నిర్మించాలి



ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఇంటి నిర్మాణం ఉంటేనే బిల్లులు మంజూరవుతాయి. 600 ఎస్ఎఫ్‌టీకి మించి నిర్మాణాలు చేయొద్దు. అంతకు మించితే చెల్లింపులకు నిబంధనలు ఒప్పుకోవు. ప్రతి లబ్ధిదారుడు నిబంధనల ప్రకారం ఇంటిని నిరించుకోవాలి.

– రాజ్‌కుమార్, హౌసింగ్ పీడీ

సాక్షి ప్రతినిధి, నల్లగొండ : ఇందిరమ్మ ఇళ్లకు నిబంధనల చిక్కు వచ్చింది. సొంత స్థలం ఉన్న పేదలు ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఇల్లు కట్టుకోవాలని అధికారులు తేల్చి చెబుతున్నారు. ప్రభుత్వం ఇచ్చే మొత్తానికి తాము కొంత కలుపుకొని ఇంటిని పెద్దగా నిర్మించుకుందామంటే.. నిబంధనలు ఒప్పుకోమంటూ అధికారులు చెబుతుండడంతో లబ్ధిదారులు గందరగోళంలో పడ్డారు. పైలెట్ ప్రాజెక్టు కింద ఇళ్లు మంజూరైన గ్రామాల్లోని లబ్ధిదారులకు ఈ నిబంధనల నుంచి ఊరట లభించినా.. మిగతా వారికి మంజూరైన ఇళ్ల విషయంలో నిబంధనలను పక్కాగా అమలు చేస్తామని అధికారులు చెబుతున్నారు.

పైలెట్ ప్రాజెక్టుగా అమలు

రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల హామీల్లో భాగంగా పేదలకు ఇందిరమ్మ ఇళ్లు నిర్మించేందుకు శ్రీకారం చుట్టింది. ఈ ఏడాది ప్రతి నియోజక వర్గానికి 3,500 చొప్పున ఇళ్లను మంజూరు చేసింది. దాంతో జిల్లాలో మొత్తం 19,698 ఇళ్లు మంజూరయ్యాయి. అందులో పైలెట్ ప్రాజెక్టు కింద ప్రతి మండలంలో ఒక గ్రామాన్ని ఎంపిక చేసింది. ఆ గ్రామంలో ఇంటి స్థలం ఉండి ఇల్లు లేని వారికి ఇళ్లను కేటాయించింది. పైలెట్ ప్రాజెక్టు కింద ఎంపికైన గ్రామాల్లో 1753 ఇళ్లను మంజూరు చేసింది. వాటి నిర్మాణాలు కొన్ని బేస్‌మెంట్ స్థాయిలో ఉంటే, మరికొన్ని రూఫ్ స్థాయిలో ఉన్నాయి.

250 ఇళ్లకు బిల్లులు చెల్లింపు

జిల్లాలో 350 ఇళ్ల నిర్మాణం బేస్‌మెంట్ స్థాయిలో ఉండగా, మూడు ఇళ్లు రూఫ్ లెవల్‌కు చేరకున్నాయి. మిగిలినవి ఇంకా ప్రారంభదశలోనే ఉన్నాయి. వాటిల్లో 250 ఇళ్లకు ఇప్పటికే మొదటి విడత బిల్లును హౌసింగ్ అధికారులు మంజూరు చేశారు.

లబ్ధిదారుల అయోమయం

కాంగ్రెస్ ప్రభుత్వం గతంలో ఇందిరమ్మ ఇళ్లను మంజూరుచేసిన సమయంలో ప్రభుత్వం ఇచ్చే డబ్బులకు లబ్ధిదారులు కొంత డబ్బును కలుపుకొని ఇళ్లు నిర్మించుకునే వెసులుబాటు ఉండేది. ప్రస్తుతం అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం మళ్లీ ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. అయితే ప్రభుత్వం ఇప్పుడు రూ.5 లక్షలతో 600 చదరపు అడుగలలోనే (ఎస్ఎఫ్‌టీ) ఇల్లు నిర్మించాలనే నిబంధన విధించింది. పైలెట్ ప్రాజెక్టుగా ఎంపికైన గ్రామాల్లో కొందరు 600 ఎస్ఎఫ్‌టీ కంటే ఎక్కువ విస్తీర్ణంలో ఇళ్ల నిర్మాణం చేపట్టారు. అయితే వారు కింద ఎంత వెడల్పులో నిర్మాణం చేపట్టినా.. పైన స్లాబ్ లెవల్‌లో మాత్రం 600 ఎస్ఎఫ్‌టీలోపే నిర్మించుకుంటామని రాత పూర్వకంగా లేఖలు ఇచ్చిన వారికి మొదటి విడత బిల్లులు చెల్లించారు. మిగిలిన ఇళ్ల విషయంలో మాత్రం 600 ఎస్ఎఫ్‌టీకి మించితే బిల్లులు ఇచ్చేది లేదని అధికారులు తేల్చి చెప్పడంతో లబ్ధిదారులు నిర్మాణాల విషయంలో అయోమయానికి గురవుతున్నారు. ప్రభుత్వం ఇచ్చే మొత్తానికి తోడు మరికొంత అప్పు చేసి ఇంటిని పెద్దగా నిర్మించుకోవాలన్న ఆలోచనల్లో ఉన్నా.. కానీ ప్రభుత్వ నిబంధన వారిని ఇరకాటంలోకి నెట్టింది.

17,945 ఇళ్లకు ప్రొసీడింగ్స్

పైలెట్ ప్రాజెక్టులో మంజూరు చేసిన ఇళ్లు పోగా, మిగిలిన 17,945 ఇళ్ల నిర్మాణాలకు జిల్లా యంత్రాంగం ఇటీవల ప్రొసీడింగ్స్ అందజేసింది. ఆయా గ్రామాల్లో ఇందిరమ్మ కమిటీలు గుర్తించిన లబ్ధిదారుల జాబితాను మండల స్థాయిలో గెజిటెడ్ అధికారులు పరిశీలించి ఫైనల్ చేసి, ఆ జాబితాను జిల్లాస్థాయికి పంపితే కలెక్టర్ ఆమోదంతో ఇన్‌చార్జి మంత్రికి పంపించారు. ఆయన ఆమోదంతో ఇళ్ల నిర్మాణానికి కలెక్టర్ ఇలా త్రిపాఠి ప్రొసీడింగ్స్ అందజేశారు. మునుగోడు, దేవరకొండ నియోజక వర్గాల్లో ఇప్పటికే ఎమ్మెల్యేలు ముగ్గు పోసి నిర్మాణాలు ప్రారంభిస్తుండగా నల్లగొండ, ఇతర నియోజక వర్గాల్లో లబ్ధిదారులే ముగ్గు పోసుకొని ఇళ్లను నిర్మించుకుంటున్నారు.

ఎల్లమ్మ ఆలయంలో మంత్రి పూజలు



అమ్మవారికి పూజలు చేస్తున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

కనగల్ : దర్వేశిపురం రేణుకా ఎల్లమ్మ బ్రహ్మోత్సవాల్లో భాగంగా రాష్ట్ర, రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి శనివారం హాజరై మొక్కులు తీర్చుకున్నారు. ఆలయంలో నూతనంగా నిర్మించిన రేణుక ఎల్లమ్మ పుట్ట మండపాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమ్మవారి ఆశీస్సులు జిల్లా ప్రజలపై ఎల్లప్పుడూ ఉండాలని ప్రార్థించినట్లు తెలిపారు. అమ్మవారి ఆలయంతోపాటు దర్వేశిపురం, కనగల్లు ప్రాంతాల అభివృద్ధికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ జల్లెపల్లి జయరామయ్య, చైర్మన్ చిదేటి వెంకటరెడ్డి, మాజీ జెడ్పీటీసీ నర్సింగ్ శ్రీనివాస్‌గౌడ్, ధర్మకర్తలు నగేష్‌గౌడ్, నవీన్‌గౌడ్, శంకర్‌రెడ్డి, రాజు, నరేష్, వెంకటయ్య, బాబు, రమేష్, దుర్గమ్మ, అర్చకులు మల్లాచారి, శ్రవణ్‌కుమార్, ఉమామహేశ్వరరావు, దామోదర్, పణి, నాగరాజు, సీనియర్ అసిస్టెంట్ చంద్రయ్య, నాగేశ్వరరావు, జూనియర్ అసిస్టెంట్ ఉపేందర్‌రెడ్డి, ఆంజనేయులు, రాజయ్య, రాజు, శ్రీకర్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన బ్రహ్మోత్సవాలు



పూర్ణాహుతిలో పాల్గొన్న మంత్రి కోమటిరెడ్డి

కనగల్ : మండలంలోని దర్వేశిపురం రేణుకా ఎల్లమ్మ ఆలయ బ్రహ్మోత్సవాలు శనివారం ముగిసాయి. ఉదయం ఆలయంలో 108 కలశాలతో అష్టోత్తర శతకటాభిషేకం, నిత్యోపాసన, బలిహరణ త్రిశూల స్నానం, నిరాజన మంత్రపుష్పాలు, తీర్థ ప్రసాదగోష్టి, ఆశీర్వచనం, పండిత సత్కారం కార్యక్రమాలు నిర్వహించారు. సాయంత్రం ధర్వేశిపురం, పర్వతగిరి గ్రామస్తులు అమ్మవారికి బోనాలు సమర్పించారు.

చెరువు శిఖాన్ని పరిశీలించిన అధికారులు



చెరువు ఆక్రమణను పరిశీలిస్తున్న ఆర్డీఓ అశోక్‌రెడ్డి

శాలిగౌరారం : మండలంలోని మాధారంకలాన్‌లో ఆక్రమణకు గురైన రామసముద్రం చెరువు శిఖం భూమిని నల్లగొండ ఆర్డీఓ వై.అశోక్‌రెడ్డి శనివారం పరిశీలించారు. చెరువు ఆయకట్టు రైతులు చెరువు శిఖం ఆక్రమణపై కలెక్టర్, ఎస్పీలతోపాటు ముఖ్యమంత్రికి రిజిస్టర్ పోస్టులో ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆదేశానుసారం నల్లగొండ ఆర్డీఓ అశోక్‌రెడ్డి శాలిగౌరారం సీఐ కొండల్‌రెడ్డి, తహసీల్దార్ యాదగిరి, ఎస్ఐ సైదులు, మండల సర్వేయర్ పద్మ, నీటిపారుదల శాఖ ఏఈ విక్రమ్ ఆక్రమణకు గురైన చెరువు శిఖం భూమిని పరిశీలించారు. ఆక్రమణకు గురైన చెరువు శిఖం భూమిని స్వాధీన పరుచుకొని చెరువు శిఖం హద్దు వరకు గోతిని తవ్వేందుకు జేసీబీని పిలిపించారు. చెరువు హద్దును నిర్ణయించే క్రమంలో వరికుప్పల జానకమ్మ, ఆమె కుటుంబీకులు జేసీబీని అడ్డుకోవడంతో పాటు ఆర్డీఓతో తీవ్ర వాగ్వాదానికి దిగారు.

ఇద్దరిపై కేసు నమోదు

ఆక్రమణకు గురైన చెరువు శిఖం భూమి స్వాధీన పరుచుకునేందుకు ఆర్డీఓ ప్రయత్నించగా వరికుప్పల జానకమ్మ, వరికుప్పల శ్రీనివాసు కలిసి అధికారులకు అడ్డుగా నిలిచి వారి విధులకు తీవ్ర ఆటంకం కలిగించారు. దీనిపై తహసీల్దార్ యాదగిరి ఇచ్చిన ఫిర్యాదు మేరకు వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ సైదులు వివరించారు.

కనుల పండువగా నృసింహుడి నిత్యకల్యాణం



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

యాదగిరిగుట్ట: యాదగిరి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శనివారం నిత్యారాధనలో భాగంగా నిత్యకల్యాణ వేడుకను అర్చకులు కనుల పండువగా నిర్వహించారు. తొలుత వేకువజామున స్వామివారి మేల్కొలుపులో భాగంగా సుప్రభాత సేవ చేపట్టారు. అనంతరం గర్భాలయంలోని స్వయంభూ, ప్రతిష్ఠా అలంకారమూర్తుకు నిజాభిషేకం, అర్చన చేసి కొలిచారు. ప్రాకార మండపంలో సుదర్శన నారసింహ హోమం, గజవాహన సేవ, స్వామి, అమ్మవారికి నిత్యకల్యాణం ఆగమశాస్త్రం ప్రకారం నిర్వహించారు. అనంతరం ముఖమండపంలో జోడు సేవోత్సవం జరిపించారు. ఆయా వేడుకల్లో భక్తులు పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. రాత్రి స్వామివారికి శయనోత్సవం చేసి ఆలయ ద్వారబంధనం చేశారు.

గృహమే.. స్వర్గసీమ



సండే స్పెషల్

'గృహమే కదా స్వర్గసీమ'.. సొంతిల్లు అనేది ప్రతి ఒక్కరి కల. అలసి సొలసి ఇంటికి చేరగానే.. ప్రశాంతమైన వాతావరణం ఉండాలని అంతా కోరుకుంటారు. అందుకు తగ్గట్టుగానే తమ స్థాయిలో ఇంటిని తీర్చిదిద్దుకుంటారు. ప్రస్తుత కాలానికి అనుగుణంగా ఇళ్ల నిర్మాణంలోనూ ట్రెండ్ మారింది. ఇంట్లో అడుగు పెట్టగానే వాహ్ అనేలా ఇంటీరియర్‌డిజైన్ చేయిస్తున్నారు. పీఓపీ, టైల్స్, ఫ్లేటడ్స్, బెడ్స్, సోపాసెట్స్‌తో ఇళ్లను ఇంద్ర భవనాలుగా తీర్చిదిద్దుతున్నారు. ఖర్చుకు ఎక్కడా వెనుకాడకుండా తమ ఇంటికి ప్రత్యేకత ఉండేలా చూసుకుంటున్నారు. ఇలా ఉమ్మడి జిల్లాలో పట్టణాల్లో చాలా ఇళ్లు నిర్మితమయ్యాయి.

-రామగిరి (నల్లగొండ), సూర్యాపేటటౌన్, మిర్యాలగూడ టౌన్

'ఇంటీ'రియర్ అదుర్స్

- చూడగానే వాహ్ అనిపించేలా ఇళ్ల నిర్మాణం
- ఖర్చుకు వెనుకాడని యజమానులు
- కోట్ల రూపాయలతో గృహ నిర్మాణం
- ఇంటీరియర్‌కు రూ.లక్షల్లో వ్యయం
- చిన్న పట్టణాలకూ విస్తరించిన కల్చర్



జూమర్ లైట్లు



ఇళ్లు నిర్మించుకునేవారు ఇంటీరియర్‌పై ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తున్నారు. ఇంటిని తమకు నచ్చేలా అందంగా ఉండేలా తాపత్రయ పడతున్నారు. ఎంత ఖర్చయినా ప్రత్యేక ఇంటీరియల్ డిజైన్ చేయించుకుంటున్నారు. నిత్యం ఉండే ఇంట్లో కనీసం ఏదో ఒక ప్రత్యేకత, ఆకర్షణ ఉండాలని కోరుకుంటున్నారు. ప్రొఫెషనల్‌గా, వ్యక్తిగతంగా అభిరుచికి తగ్గట్టు ఇంటి కన్‌స్ట్రక్షన్ నుంచే ఇంటీరియర్ ప్లాన్ చేసుకుంటున్నారు. ప్రతి ఒక్కరూ స్థాయికి తగ్గట్టు ఇంటీరియర్ డెకరేషన్, సీలింగ్‌ను ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్‌తో ఆకట్టుకునేలా తీర్చిదిద్దుతున్నారు. సామాన్య, మధ్య తరగతి కుటుంబాలు కూడా విలాసవంతమైన ఇళ్ల నిర్మాణానికి మొగ్గు చూపుతున్నారు. మొన్నటి వరకు హైదరాబాద్ వంటి నగరాలకే పరిమితమైన ఈ ట్రెండ్ ఇప్పుడు పట్టణాలకు పాకింది.

జిగేల్.. జిగేల్..

ఇంటిని అందంగా తీర్చిదిద్దుకునే క్రమంలో వివిధ రకాల డిజైన్లతో సీలింగ్, ఇతర పనులను చేయిస్తున్నారు. యజమానులు, నిపుణుల ద్వారా ఈ డిజైన్లను తయారు చేయించి హైదరాబాద్ నుంచి ప్రత్యేకంగా పీఓపీ, జిప్సం బోర్డులు, లైటింగ్, వాల్ పేయింట్స్, టెక్షర్ వాల్ పేపర్లు, ఫర్నిచర్, ఉడ్ వర్క్‌పై లామినేట్స్ తెప్పించి కంటికి అందంగా కనిపించేలా తీర్చిదిద్దుకుంటున్నారు. ఇతర రాష్ట్రాలు, విదేశాల నుంచి సైతం దిగుమతి చేసుకున్న ఆకర్షణీయమైన వస్తువులు, స్థానికంగా లభించే అందమైన కళాకృతులు, వేలాడే లైట్లు, కిటికీలు, టీ పాయ్ సొగసులు, ప్రత్యేక లైట్లతో సీలింగ్ డిజైన్‌లు ఆకర్షించేలా నిర్మించుకుంటున్నారు. విద్యుత్ దీపాల వెలుగులో ఇల్లంతా మరింత జిగేల్.. జిగేల్ మనేలా మార్చుకుంటున్నారు. ఇలా ఇంటిని బట్టి కేవలం ఇంటీరియర్ కోసమే సుమారు రూ.పది లక్షల నుంచి రూ.15 లక్షల వరకు వెచ్చిస్తున్నారంటే అతిశయోక్తి కాదు. ప్రస్తుతం కాలానుగుణంగా ఒకరిని చూసి మరొకరు ఇంటిని నిర్మాణాన్ని చేపడుతున్నారు.



నల్లగొండ పట్టణంలోని ఓ ఇంట్లో ఇంటీరియర్ డెకరేషన్

ఆకట్టుకునేలా టీవీ యూనిట్స్..

ముఖ్యంగా ఇంటి హాల్‌లో టీవీ యూనిట్స్‌ను ప్రత్యేకంగా డిజైనింగ్ చేయించుకుంటున్నారు. ఇంట్లోకి రాగానే టీవీ యూనిట్ ఆకర్షణీయంగా కనబడేలా చూసుకుంటున్నారు. వీటి కోసం ప్లైవుడ్‌తో పాటు ఇతర రాష్ట్రాల నుంచి ప్రత్యేకంగా మెటీరియల్స్ తెప్పించి బీహార్, ఢిల్లీ తదితర ప్రాంతాల డిజైనర్లతో తయారు చేయిస్తున్నారు.

ఆహ్లాదకర వాతావరణం ఉండాలి



ఇంట్లో ఆహ్లాదకరమైన వాతావరణం ఉండాలి. అందు కోసం ఎంతో కష్టపడాల్సి ఉంటుంది. అనుభవం ఉంటే తప్ప అందమైన ఇల్లు నిర్మించలేం. ఇంటికి కావాల్సిన డిజైన్లు అన్నీ డిజైనర్లు, అర్కిటెక్షర్ల వద్ద అందుబాటులో ఉంటున్నాయి. ఇంటీరియర్స్ కోసం ఒకప్పుడు హైదరాబాద్ వెళ్లాల్సిన పరిస్థితి ఉండేది. ఇప్పుడు నల్లగొండలోనే లభ్యమవుతున్నాయి.

– వై.పద్మ, ఇంటి యజమాని, నల్లగొండ

ఇంటి యజమాని కోరుకున్న రీతిలో డిజైన్



అందరూ ఇంటిని అందంగా తీర్చిదిద్దుకునేందుకు ఆసక్తి చూపిస్తున్నారు. కిచెన్, లివింగ్ రూం, డబుల్‌బెడ్ రూమ్‌కు ఉడ్ వర్క్‌కు రూ.7 లక్షల నుంచి రూ.10 లక్షల వరకు ఖర్చు అవుతుంది. ఉడ్‌వర్క్‌కు సంబంధించి బెంగళూరు, ఢిల్లీ నుంచి తెప్పిస్తాం. ఇంటికి ఇటాలియన్ టైల్స్ వాడితే లుక్కింగ్ గ్రాండ్‌గా ఉంటుంది. సీలింగ్‌లో ప్రొఫైల్ లైట్స్, బాల్కనీలో డబ్ల్యూ పీవీసీ సీలింగ్ బాగుంటుంది. ఉడ్ వర్క్‌లో కిచెన్, బెడ్ రూమ్‌లో 6 ఎంఎం డబ్ల్యూపీవీసీ వాడితే చెదలు రాకుండా లైఫ్ ఎక్కువగా ఉంటుంది. ఇంటి యజమానులు కోరుకున్న రీతిలో వారికి డిజైన్లు చూపించిన ఇంటిని ముస్తాబు చేసి ఇస్తున్నాం.

– జి.దినేష్, ఇంటీరియర్ డిజైనర్, నల్లగొండ





క్లుప్తంగా

నేడు రాష్ట్రస్థాయి మీడియా సదస్సు

బీబీనగర్: బ్రహ్మకుమారీస్ ఈశ్వరీయ విశ్వ విద్యాలయం ఆధ్వర్యంలో బీబీనగర్ మండలం మహాదేవ్‌పురం పరిధిలో గల సైలెంట్ రీట్రీట్ సెంటర్‌లో ఆదివారం రాష్ట్రస్థాయి మీడియా సదస్సు నిర్వహించనున్నట్లు బ్రహ్మకుమారీస్ మీడియా వింగ్ వైస్ చైర్మన్ సరళ, సైలెన్స్ రిట్రీట్ సెంటర్ డైరెక్టర్లు రాజ్‌కుమారీ, సునీత దీదీ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సమాజంలో మీడియా పాత్రపై ఈ సదస్సు జరగనున్నట్లు తెలిపారు. ఈ సదస్సుకు ప్రెస్ అకాడమీ చైర్మన్ కె. శ్రీనివాస్‌రెడ్డి, హైదరాబాద్ ప్రెస్ క్లబ్ ప్రెసిడెంట్ వేణుగోపాలనాయుడు, రిటైర్డ్ హైకోర్టు జడ్జి జస్టిస్ వి. ఈశ్వరయ్య, ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా మాజీ సభ్యుడు యూ. లక్ష్మణ్ తదితరులు హాజరుకానున్నట్లు పేర్కొన్నారు.

గోవుల పట్టివేత

చింతపల్లి: డీసీఎంలో అక్రమంగా తరలిస్తున్న గోవులను శనివారం చింతపల్లి మండల పరిధిలోని మాల్ వెంకటేశ్వరనగర్ చెక్‌పోస్ట్ వద్ద పోలీసులు పట్టుకున్నారు. ఎస్‌ఐ ముత్యాల రామ్మూర్తి తెలిపిన వివరాల ప్రకారం.. శని వారం తెల్లవారుజామున మాల్ వెంకటేశ్వరనగర్ చెక్ పోస్ట్ వద్ద పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తుండగా.. మల్లేపల్లి నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న డీసీఎంలో 9 ఆవులు, 9 లేగ దూడలను అక్రమంగా తరలిస్తుండగా పట్టుకున్నారు. గోవులను స్వాధీనం చేసుకున్న చింతపల్లిలోని శ్రీకృష్ణ గోకులం గోశాలకు తరలించినట్లు ఎస్‌ఐ తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తునట్లు పేర్కొన్నారు.

విద్యుదాఘాతంతో ఎలక్ట్రీషియన్ మృతి

సూర్యాపేట రూరల్: విద్యుదాఘాతానికి గురైన ఎలక్ట్రీషియన్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. ఎస్‌ఐ బాలునాయక్ తెలిపిన వివరాల ప్రకారం.. సూర్యాపేట మండల పరిధిలోని యర్కారం గ్రామానికి చెందిన కొలిశెట్టి గోవర్ధన్(40) ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తున్నాడు. గ్రామంలో ఎల్‌టీ లైన్ వైర్లు కిందకు జారగా, శుక్రవారం వాటికి మరమ్మతులు చేస్తుండగా.. పైన ఉన్న 11 కేవీ వైరుకు ఎల్‌టీ వైరు తగిలింది. దీంతో గోవర్ధన్ విద్యుదాఘాతానికి గురయ్యాడు. వెంటనే అతడిని గ్రామస్తులు చికిత్స నిమిత్తం సూర్యాపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో కుటుంబ సభ్యులు హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ శనివారం మృతిచెందాడు. మృతుడి కుమార్తె కొలిశెట్టి వనిత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

రెండు గుళ్లలో చోరీ

నకిరేకల్: నకిరేకల్ మండలం చందంపల్లి గ్రామంలోని రెండు గుళ్లలో శుక్రవారం అర్ధ రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చందంపల్లిలోని చెరువు కట్టపై గల కట్ట మైసమ్మ గుడిని గుర్తుతెలియని వ్యక్తులు ధ్వంసం చేసి 5 వెండి కళ్లను దొంగిలించారు. అదేవిధంగా గ్రామంలోని కలిమెర సత్తయ్య వ్యవసాయ భూమిలో ఉన్న వన మైసమ్మ గుడి బండలను పగులగొట్టి పుస్తె, వెండి మట్టెలను (వన్ గ్రామ్ గోల్డ్) చోరీ చేశారు. స్థానికుడు మేడబోయిన సైదులు ఫిర్యాదు మేరకు నకిరేకల్ ఎస్‌ఐ క్రిష్ణమాచారి ఘటనా స్థలాన్ని సందర్శించి కేసు నమోదు చేశారు.

రైతుల ఆర్థిక స్వావలంబనే లక్ష్యం

పీఏసీఎస్‌ల ఆధ్వర్యంలో రైతు ఉత్పత్తిదారుల సంఘాల ఏర్పాటు

- ఉమ్మడి జిల్లాలో 37 ఎఫ్‌పీఓలు ఏర్పాటు చేసేందుకు సన్నద్ధం
- రైతులు పండించిన పంట ఉత్పత్తులకు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చేందుకు కృషి



రామన్నపేట పీఏసీఎస్ కార్యాలయం

రామన్నపేట: రైతులు పండించిన పంటలకు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో మార్కెటింగ్ కల్పించేందుకు గాను కేంద్ర ప్రభుత్వం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల(పీఏసీఎస్) ఆధ్వర్యంలో రైతు ఉత్పత్తిదారుల సంఘాలు(ఎఫ్‌పీఓ) ఏర్పాటు చేయాలని సంకల్పించింది. ఈ మేరకు తెలంగాణ రాష్ట్రంలో తొలుత 311 ఎఫ్‌పీఓల ఏర్పాటుకు సంబంధించిన అనుమతుల ప్రక్రియ పూర్తయ్యింది. పీఏసీఎస్‌ల నిర్వహణను రాష్ట్ర ప్రభుత్వం చూస్తుండగా.. ఇందులో గ్రామీణ ప్రాంతాల్లోని రైతులు, స్థానికులు సాధారణ సభ్యత్వం పొందవచ్చు. పీఏసీఎస్‌ల ద్వారా రైతులకు వ్యవసాయ పంట రుణాలు, దీర్ఘకాలిక రుణాలు అందించడంతో పాటు ఎరువులు, విత్తనాలను సరఫరా చేస్తున్నారు. రైతులు పండించిన ధాన్యం ఇతర పంటలను కొనుగోలు చేసి పౌరసరఫరాల శాఖకు అందజేస్తున్నారు. కొనుగోలు కేంద్రాలు నిర్వహించినందుకు ప్రభుత్వం పీఏసీఎస్‌లకు కమీషన్ చెల్లిస్తుంది. వీటికి ప్రభుత్వంతో పాటు సహకార బ్యాంకుల నుంచి రుణాలు, రాయితీలు అందుతాయి. వీటి నిర్వహణలో రాజకీయ జోక్యం ఎక్కువగా ఉంటుంది.

ఎఫ్‌పీఓలతో రైతులకు మరింత మేలు

పీఏసీఎస్‌ల ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్న ఎఫ్‌పీఓలతో రైతులకు మరింత మేలు జరుగనుంది. కంపెనీ చట్టాల పరిధిలోకి వచ్చే ఎఫ్‌పీఓలను సీబీబీఓ(క్లస్టర్ బేస్డ్ బోర్డ్ ఆర్గనైజేషన్) హైదరాబాద్ కేంద్రంగా పర్యవేక్షిస్తుంది. పీఏసీఎస్‌ల్లోని సభ్యులు అదనంగా రూ.1000 సభ్యత్వ రుసుము చెల్లించి ఎఫ్‌పీఓలలో సభ్యులుగా చేరవచ్చు. వీటిల్లో రైతులు, ఉత్పత్తిదారులకు మాత్రమే సభ్యత్వం ఇవ్వనున్నారు. ప్రతీ సంఘానికి కేంద్ర ప్రభుత్వమే ఈక్విటీ గ్రాంట్ క్రింద రూ.15లక్షలు, నిర్వహణకు ఏటా రూ.6లక్షల చొప్పున మూడేళ్ల పాటు చెల్లిస్తుంది. ప్రస్తుతానికి పీఏసీఎస్‌ల కార్యదర్శినే ఎఫ్‌ఈఓలకు సీఈఓగా వ్యవహరించే అవకాశం ఉంది. అదనంగా ఒక అకౌంటెంట్‌ను నియమిస్తారు. ఎఫ్‌పీఓలు వాణిజ్య సంస్థల సహకారంతో రైతుల ఉత్పత్తులకు మార్కెటింగ్ సౌకర్యం కల్పించనున్నారు. రైతులు పండించిన విభిన్నమైన పంట ఉత్పత్తులకు జాతీయస్థాయిలో బ్రాండ్ ఇమేజ్ తీసుకురావడానికి, ఆర్గానిక్ ఉత్పత్తులను ప్రోత్సహించడం, రైతులకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం అందించడానికి ఎఫ్‌పీఓలు దోహదపడతాయి. ఎఫ్‌పీఓలలో సభ్యులుగా చేరిన రైతులకు వ్యాపార ప్రణాళిక తయారీ, మార్కెటింగ్ అంశాలపై శిక్షణ ఇస్తారు.

రైతులకు చాలా ఉపయోగకరం



ప్రభుత్వం నూతనంగా ఏర్పాటు చేస్తున్న ఎఫ్‌పీఓలు రైతులకు చాలా ఉపయోగకరంగా ఉంటాయి. కేంద్ర ప్రభుత్వం జాతీయ స్థాయిలో సహకారశాఖ ఆధ్వర్యంలో ఎగుమతులు, దిగుమతులకు సంబంధించి మూడు సంస్థలను ఏర్పాటు చేసింది. వాటికి ఎఫ్‌పీఓలను అనుసంధానం చేస్తారు. తద్వారా స్థానిక ఉత్పత్తులకు జాతీయ, అంతర్జాతీయస్థాయిలో గుర్తింపు లభిస్తుంది. ఆర్గానిక్ ఉత్పత్తులను ప్రోత్సహించడం జరుగుతుంది. మార్కెటింగ్ బాగా పెరుగుతుంది. అయితే ఎఫ్‌పీఓల ఏర్పాటుకు సంబంధించి ప్రభుత్వం నుంచి ఇంకా పూర్తిస్థాయిలో మార్గదర్శకాలు వెలువడలేదు.

– జి. మురళీరమణ, డీసీఓ, యాదాద్రి జిల్లా

ఉమ్మడి జిల్లాలో 37 ఎఫ్‌పీఓలు

ఉమ్మడి జిల్లాలో 131 పీఏసీఎస్‌లు ఉండగా.. 37 ఎఫ్‌పీఓలను ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం సన్నద్ధమైంది. నల్లగొండ జిల్లాలో శాలిగౌరారం, కట్టంగూర్, కేతేపల్లి, నార్కట్‌పల్లి, వెలిమినేడు, గుండ్రాంపల్లి, పెద్దవూర, దేవరకొండ, చండూరు, తిప్పర్తి, దామరచర్ల, గుర్రంపోడు, గొల్లగూడలో, సూర్యాపేట జిల్లాలో నడిగూడెం, చిలుకూరు, సూర్యాపేట, మేళ్లచెరువు, చిల్లేపల్లి(నేరేడుచర్ల), పాలకీడు, చివ్వెంల, నారాయణగూడ, పానుగోడులో, యాదాద్రి జిల్లాలో గుండాల, చందుపట్ల, రామన్నపేట, సంస్థాన్ నారాయణపురం, రాజపేట, తుర్కపల్లి, ఆలేరు, ఆత్మకూరు(ఎం), అడ్డగూడూరు, చౌటుప్పల్, పోచంపల్లి, బీబీనగర్, యాదగిరిగుట్ట, మోత్కూరు, బొమ్మలరామారంలో ఎఫ్‌పీఓలను ఏర్పాటు చేయనున్నారు. ఒక్కో ఎఫ్‌పీఓలో గరిష్టంగా 300మంది సభ్యులుగా చేరవచ్చు. ఈ సంఘాల యాజమాన్య బోర్డుల్లో మహిళా రైతులకు ప్రాతినిధ్యం కల్పిస్తారు.

రేకుల షెడ్ పైనుంచి పడి యువకుడి మృతి



టీమేజ్ కంపెనీ ఎదుట ధర్నా చేస్తున్న మృతుడి కుటుంబ సభ్యులు

- టీమేజ్ బిల్డర్స్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలో ఘటన
- నష్టపరిహారం చెల్లించాలని మృతుడి బంధువుల ఆందోళన

కట్టంగూర్: కట్టంగూర్ మండలం పామనగుండ్ల గ్రామ శివారులో గల టీమేజ్ బిల్డర్స్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలో రేకుల షెడ్ పైనుంచి పడి యువకుడు మృతిచెందాడు. మృతుడ కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. రామన్నపేట మండలం ఉత్తటూరు గ్రామానికి చెందిన మేడి రఘువరన్(28) గత ఐదేళ్లుగా టీమేజ్ బిల్డర్స్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలో బెండింగ్ మిషన్ ఆపరేటర్‌గా పనిచేస్తున్నాడు. శుక్రవారం డ్యూటీకి వెళ్లిన రఘువరన్ ఉదయం గం.9.45 సమయంలో తనకు సంబంధం లేని పనిచేయాలని కంపెనీ యాజమాన్యం ఆదేశించడంతో.. మరో ఇద్దరు కార్మికులతో కలిసి రేకుల షెడ్డు పైన ఉన్న వెంటిలేషన్ రేకులు క్లీన్ చేస్తున్నాడు. ఈ క్రమంలో వెంటిలేషన్ రేకుపై కాలు పెట్టడటంతో రేకు విరిగి కిందపడిపోయాడు. దీంతో అతడి తలకు తీవ్ర గాయాలయ్యాయి. ఇది గమనించిన తోటి కార్మికులు అతడిని వెంటనే నార్కట్‌పల్లిలోని కామినేని ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో కుటుంబ సభ్యులు హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ శుక్రవారం సాయంత్రం మృతిచెందాడు.



మేడి రఘువరన్ (ఫైల్)

మృతుడి బంధువులు రాస్తారోకో

రఘువరన్ కుటుంబానికి నష్టపరిహారం చెల్లించి తగిన న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ అతడి బంధువులు శనివారం కంపెనీ ఎదుట విజయవాడ-హైదరాబాద్ జాతీయ రహదారిపై రాస్తారోకో చేశారు. దీంతో జాతీయ రహదారిపై ట్రాఫిక్ స్తంభించింది. విషయం తెలుసుకున్న పోలీసులు మృతుడి బంధువులకు న్యాయం చేస్తామని హామీ ఇవ్వటంతో రాస్తారోకో విరమించారు. నల్లగొండ డీఎస్పీ శివరాంరెడ్డి కంపెనీ వద్దకు చేరుకొని మృతుడి బంధువులను కట్టంగూర్ పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లి కంపెనీ యాజమాన్యంతో మాట్లాడి నష్టపరిహారం అందిస్తామని హామీ ఇచ్చారు. మృతుడి తల్లి మేడి లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ ఎం. రవీందర్ తెలిపారు. మృతుడికి భార్య ఉంది.

యాజమాన్యం నిర్లక్ష్యంతోనే..

టీమేజ్ బిల్డర్స్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలో ఉన్న రెండు రేకుల షెడ్లు సుమారు 45 నుంచి 50 ఫీట్ల ఎత్తులో ఉంటాయి. 2017లో ఈ కంపెనీ స్థాపించారు. వెంటిలేషన్ కోసం 8ఏళ్ల క్రితం ఏర్పాటు చేసిన తెల్లరంగు ప్లాస్టిక్ రేకులు పటుత్వం కోల్పోయాయి. కంపెనీ యాజమాన్యం నిర్లక్ష్యంతోనే రఘువరన్ మృతిచెందాడని కుటుంబ సభ్యులు, బంధువులు ఆరోపిస్తున్నారు.

రైలు పట్టాలపై మహిళ ఆత్మహత్యాయత్నం

- సకాలంలో స్పందించి కాపాడిన పోలీసులు



మహిళను రక్షించి తీసుకెళ్తున్న పోలీసు

మిర్యాలగూడ అర్బన్: రైలు పట్టాలపై ఆత్మహత్యాయత్నం చేసిన మహిళను మిర్యాలగూడ టూటౌన్ పోలీసులు కాపాడారు. వివరాలు.. మిర్యాలగూడ పట్టణ సమీపంలోని రైలు పట్టాలపై శనివారం ఓ మహిళ ఆత్మహత్యాయత్నం చేసుకుంటున్నట్లు టూటౌన్ పోలీసులకు డయల్ 100 ద్వారా ఫోన్ కాల్ వచ్చింది. దీంతో డ్యూటీలో ఉన్న కానిస్టేబుల్ పి. ధనుంజయ, హోంగార్డు నాగరాజు వెంటనే అప్రమత్తమై వెంటనే రైల్వే స్టేషన్‌కు వెళ్లి పట్టాలపై ఉన్న మహిళను సురక్షితంగా కాపాడి పోలీస్ స్టేషన్‌కు తీసుకొచ్చారు. ఆ మహిళకు సీఐ సోమ నర్సయ్య కౌన్సిలింగ్ ఇచ్చి కుటుంబ సభ్యులకు అప్పగించారు. సకాలంలో స్పందించి మహిళను కాపాడిన కానిస్టేబుల్ ధనుంజయ, హోంగార్డు నాగరాజును మిర్యాలగూడ డీఎస్పీ రాజశేఖర్‌రాజు, సీఐ సోమ నర్సయ్య అభినందించారు.

కేసీఆర్‌ను తిట్టడానికే సీఎం సభ పెట్టిండు

- నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య



మాట్లాడుతున్న చిరుమర్తి లింగయ్య

నార్కట్‌పల్లి: మాజీ సీఎం కేసీఆర్‌ను తిట్టడానికే శుక్రవారం ఆలేరులో సీఎం రేవంత్‌రెడ్డి సభ నిర్వహించారని నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య ఆరోపించారు. శనివారం నార్కట్‌పల్లి మండల కేంద్రంలోని తన నివాసంలో ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే బీఆర్ఎస్ పార్టీ స్వాగతం పలికింది తప్ప ఎక్కడా అడ్డుకోలేదని పేర్కొన్నారు, ఇప్పుడు జిల్లాలో ఉన్న కాంగ్రెస్ హేమాహేమీలే అప్పుడు రైతులను రెచ్చగొట్టి ప్రాజెక్టుల నిర్మాణానికి అడ్డుపడ్డారన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం తీసుకొచ్చిన గంధమల్ల ప్రాజెక్టుకు మళ్లీ శంకుస్థాపన చేయడం సిగ్గుచేటన్నారు. కాళేశ్వరం, మల్లన్న సాగర్ లేకుండా గంధమల్ల ప్రాజెక్టుకు నీళ్లు రావని కాంగ్రెస్ నాయకులు గ్రహించాలన్నారు. యాదగిరిగుట్ట క్షేత్రం సన్నిధిలో మెడికల్ కళాశాలకు బీఆర్ఎస్ ప్రభుత్వం రూ.182 కోట్లు మంజూరు చేసి మాజీ మంత్రి హరీష్‌రావు గతంలోనే శంకుస్థాపన చేశారని గుర్తుచేశారు. యాదాద్రిని యాదగిరిగుట్టగా మార్చడాన్ని ఎవరూ స్వాగతించలేదని పేర్కొన్నారు. పదేళ్ల కేసీఆర్ సంపద సృష్టిస్తే కాంగ్రెస్ నాయకులు దానిని కొల్లగొడుతున్నారని విమర్శించారు. దాదాపు అన్ని నియోజకవర్గాల్లో పోలీసులు, అధికారులు అత్యుత్సాహం ప్రదర్శిస్తున్నారని అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి సభలో కేసీఆర్‌ను తిడుతుంటే ప్రజలు బాధపడ్డారని అన్నారు. రుణమాఫీ పూర్తిగా అమలు చేయకపోవడంతోనే రైతులు ఆలేరు సభకు రాలేదని, కాంగ్రెస్ ప్రభుత్వంలో ప్రజలు ఎవరూ సంతోషంగా లేరని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు బైరెడ్డి కరుణాకర్‌రెడ్డి, దోసపాటి విష్ణుమూర్తి, మాజీ ఎంపీటీసీలు చిరుమర్తి యాదయ్య, దుబ్బాక పావనిశ్రీధర్, మాజీ సర్పంచ్ కర్నాటి ఉపేందర్, పక్కీరు సత్తిరెడ్డి, జినుకల కార్తీక్ ఉన్నారు.

జల నారాయణస్వామికి మంగళహారతులు



మంగళహారతులు ఇస్తున్న అర్చకులు

భువనగిరి: భువనగిరి పట్టణంలోని స్వర్ణగిరి క్షేత్రంలో శనివారం రాత్రి జల నారాయణస్వామికి మంగళహారతులు సమర్పించారు. ఉదయం సుప్రభాత సేవ, తోమాల సేవ, సహస్రనామార్చన సేవ, నిత్య కల్యాణం జరిపించారు. మధ్యాహ్నం సుమారు 4వేల మంది భక్తులకు అన్నదానం చేశారు. సాయంత్రం తిరువీధి ఉత్సవ సేవ, కర్పూర మంగళహారతుల సమర్పణ కార్యక్రమాలను నిర్వహించారు. వేసవి సెలవులు ముగుస్తుండడంతో పాటు వారంతం కావడంతో భక్తులతో ఆలయ పరిసరాలు కిటకిటలాడాయి. ఆయా కార్యక్రమాల్లో ఆలయ అర్చకులు, భక్తులు పాల్గొన్నారు. స్వర్ణగిరి క్షేత్రాన్ని మిస్ ఏసియా, జాతీయ హ్యాండ్లూమ్ బాసిడర్ రష్మి ఠాగూర్ సందర్శించి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు.



స్వర్ణగిరి క్షేత్రంలో మిస్ ఏసియా, జాతీయ హ్యాండ్లూమ్ అంబాసిడర్ రష్మి ఠాగూర్

ఎర్ర జెండాతోనే అసమానతలు లేని సమాజం

- ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం

వేములపల్లి: ఎర్ర జెండాతోనే అసమానతలు లేని సమసమాజ స్థాపన సాధ్యమవుతుందని ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం అన్నారు. శనివారం వేములపల్లి మండల కేంద్రంలో సీపీఐ 7వ మండల మహాసభలో పార్టీ జాతీయ కౌన్సిల్ సభ్యుడు పల్లా వెంకట్‌రెడ్డితో కలిసి ఆయన పాల్గొని మాట్లాడారు. సీపీఐ పేద, బడుగు, బలహీనవర్గాలు సమస్యల పరిష్కారానికి అనేక పోరాటాలు నిర్వహించిందన్నారు. దేశంలో అసమానతలు విపరీతంగా పెరిగి ధనికులు మరింత ధనికులుగా, పేదవాళ్లు మరింత పేదవాళ్లుగా మారుతున్నారని అన్నారు. కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలన్నారు. అనంతరం పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు బంటు వెంకటేశ్వర్లు మాట్లాడారు. ఈ మహాసభలో మద్దిరాల రంగారెడ్డి, అంజనపల్లి రామలింగం, శాంతమ్మ, ఉదయ్, శ్రీనివాస్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, పుట్టల నాగయ్య, పుట్టల కృష్ణ, వల్లంపట్ల వెంకన్న, మున్నయ్య, సుధాకర్, జయ, సత్యం, పరమేష్, లింగయ్య, ఆనందం తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర యాజమాన్యంపై అవగాహన ఉండాలి



మాట్లాడుతున్న ఐసీఏఆర్- ఐఐఆర్ఆర్ శాస్త్రవేత్త సతీష్ చౌహాన్

నడిగూడెం : రైతులకు పంటల సమగ్ర యాజమాన్యంపై అవగాహన ఉండాలని హైదరాబాద్‌కు చెందిన ఇండియన్ కౌన్సిల్ అగ్రికల్చర్ రీసెర్చ్ (ఐసీఏఆర్)– ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రైస్ రీసెర్చ్ (ఐఐఆర్ఆర్) శాస్త్రవేత్త డాక్టర్.సతీష్ చౌహాన్, గడ్డిపల్లి కేవీకే శాస్త్రవేత్తలు సీహెచ్.నరేష్, సుగంధి అన్నారు. వికసిత్ కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమంలో భాగంగా శనివారం నడిగూడెం మండల కేంద్రంలోని రైతు వేదికలో వ్యవసాయ శాఖ, గడ్డిపల్లి కేవీకే ఆధ్వర్యంలో నిర్వహించిన రైతు సదస్సులో వారు మాట్లాడారు. వరి, పత్తి, మిరప, పెసర తదితర పంటల సాగులో సమగ్ర యాజమాన్య పద్ధతులను వివరించారు. ప్రతి రైతు భూసార పరీక్షలు చేయించుకోవాలని, భూసార పరీక్షల ఫలితాల ఆధారంగా ఎరువులను వినియోగించాలని సూచించారు. సేంద్రియ పద్ధతిలో వ్యవసాయం, సమగ్ర ఎరువుల యాజమాన్యం, పశుగ్రాసం సాగులో మెళకువలు, పాల ఉత్పత్తి, చేపలు, నాటుకోళ్ల పెంపకం తదితర అంశాలపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సదస్సులో కోదాడ ఏడీఏ డి.యల్లయ్య, మండల వ్యవసాయాధికారి రాయపు దేవప్రసాద్, ఏఈఓ పిచ్చయ్య, రైతులు పాల్గొన్నారు.

మూసీ ప్రక్షాళన చేయాలి

- మాజీ ఎమ్మెల్సీ చెరుపల్లి సీతారాములు

చిట్యాల: సీఎం రేవంత్‌రెడ్డి గతంలో ప్రకటించిన విధంగా మూసీ పరీవాహక ప్రాంతం ప్రక్షాళన చేసి గోదావరి జలాలు అందించాలని మాజీ ఎమ్మెల్సీ చెరుపల్లి సీతారాములు డిమాండ్ చేశారు. శనివారం చిట్యాల పట్టణంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రామన్నపేటలో కాలుష్యకారక సిమెంట్ పరిశ్రమ ఏర్పాటును ప్రజలంతా వ్యతిరేకించినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం ఆ పరిశ్రమ ఏర్పాటుపై ఎలాంటి ప్రకటన చేయలేదన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన ఆరు గ్యారంటీలను కాంగ్రెస్ పార్టీ కచ్చితంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు జిట్ట నగేష్, ఐతరాజు యాదయ్య, బొబ్బలి సుధాకర్‌రెడ్డి, జిట్ట స్వామి, కృష్ణ తదితరులు ఉన్నారు.

వ్యక్తి అదృశ్యం



చెన్నోజు నర్సింహాచారి

రామన్నపేట: రామన్నపేట మండలం వెల్లంకి గ్రామానికి చెందిన చెన్నోజు నర్సింహాచారి అదృశ్యమైనట్లు ఎస్‌ఐ పి. మల్లయ్య తెలిపారు. నర్సింహాచారి ఈ నెల 6న ఉదయం పని నిమిత్తం చౌటుప్పల్‌కు వెళ్లి వస్తానని చెప్పి ఇంటి నుంచి బయల్దేరాడు. సాయంత్రం వరకు తిరిగి ఇంటికి రాలేదు. ఫోన్ చేస్తే స్విచ్ఛాఫ్ వచ్చింది. శనివారం తెల్లవారుజామున అతడి కుమారుడు ఫోన్ చేస్తే సికింద్రాబాద్‌లో ఉన్నానని చెప్పి ఫోన్ కట్ చేశాడు. ఆయన కోసం ఎంత వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో నర్సింహాచారి భార్య పద్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు శనివారం కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ మల్లయ్య తెలిపారు.

పొగచూరిన కోతి!

- టైర్ల రీసైక్లింగ్ కంపెనీల పొగతో నల్లగా మారిన వానరం



నలుపు రంగులోకి మారిన వానరం

మోటకొండూర్: మోటకొండూరు మండలం కాటేపల్లి వద్ద టైర్ల రీసైక్లింగ్‌కు సంబంధించి రెండు కంపెనీలు ఏర్పాటు చేశారు. ఇందులో ఒక కంపెనీ ఆరు నెలల క్రితం, మరో కంపెనీ రెండు నెలల క్రితం ఉత్పత్తులను ప్రారంభించింది. ఈ కంపెనీల నుంచి వస్తున్న పొగ, నల్లటి ధూళి వల్ల పంట చేలు నల్లబారుతున్నాయి. అంతే కాకుండా అక్కడ సంచరిస్తున్న కోతులు సైతం నలుపు రంగులోకి మారుతున్నాయి. ఈ పొగ, ధూళి ప్రజారోగ్యంపై ప్రభావం చూపకముందే పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అధికారులు సమీక్ష నిర్వహించి కంపెనీలపై చర్యలు తీసుకోవాలని, సాగుకు అనువుగా లేని ప్రాంతానికి కంపెనీలను తరలించేలా చూడాలని కోరుతున్నారు.

గోవధను అడ్డుకున్న పోలీసులు

- 13 గోవులను రక్షించి గోశాలకు తరలింపు

గుర్రంపోడు: గుర్రంపోడు మండలం చామలోనిబావి గ్రామ శివారులోని బత్తాయి తోటలో శనివారం గోవధను పోలీసులు అడ్డుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చామలోనిబావి గ్రామ శివారులోని బత్తాయి తోటలో ఆవులను తీసుకొచ్చి గోవధ చేస్తున్నారనే పక్కా సమాచారం మేరకు పోలీసులు దాడి చేసి నలుగురిని అదుపులోకి తీసుకున్నారు. అయితే పోలీసులు రాకముందే కొన్ని గోవులను చంపి మాంసాన్ని వ్యాన్లలో హైదరాబాద్‌కు తరలించారనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. 13 గోవులను స్వాధీనం చేసుకుని చింతపల్లి గోశాలకు పోలీసులు తరలించారు. ఈ దాడుల్లో దేవరకొండ ఏఎస్పీ మౌనిక, కొండమల్లేపల్లి సీఐ రాజు, ఎస్‌ఐ పసుపులేటి మధు, పరిసర మండలాల ఎస్‌ఐలు పాల్గొన్నారు.

యాదగిరిగుట్టకు బారులుదీరిన భక్తులు



ఆలయ క్యూకాంప్లెక్స్‌లో నిండిపోయిన భక్తులు

- స్వామివారిని దర్శించుకున్న లక్ష మందికి పైగా భక్తులు
- ధర్మ దర్శనానికి మూడు గంటల పైగానే సమయం..

యాదగిరిగుట్ట: వేసవి సెలవులు ముగుస్తుండటంతో యాదగిరిగుట్టకు శనివారం భక్తుల రద్దీ ఒక్కసారిగా పెరిగింది. దీంతో ఆలయ పరిసరాలు, క్యూకాంప్లెక్స్, క్యూలైన్లు, ప్రసాద విక్రయశాల, మాడ వీధులు భక్తులతో కిటకిటలాడాయి. స్వామివారి ధర్మ దర్శనానికి మూడు గంటలకు పైన, వీఐపీ దర్శనానికి గంటకు పైగా సమయం పట్టింది. లక్ష మందికి పైగా భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. వివిధ పూజలతో నిత్యాదాయం రూ.58,19,135 వచ్చినట్లు ఆలయ అధికారులు వెల్లడించారు. ఆదివారం భక్తుల రద్దీ మరింత పెరగనుందని ఆలయాధికారులు చెబుతున్నారు.

భక్తులకు మజ్జిగ, నీళ్లు పంపిణీ

యాదగిరిగుట్ట: భక్తుల రద్దీ ఎక్కువగా ఉండటంతో శనివారం ఉదయం ఈఓ వెంకట్రావ్ క్యూలైన్లు, ఆలయ పరిసరాలను తిరిగి పరిశీలించారు. భక్తులకు తాగునీరు, మజ్జిగ అందించేందుకు ఏర్పాట్లు చేయాలని ఉద్యోగులను ఆదేశించారు. దీంతో ఆలయ ఉద్యోగులు, సిబ్బంది క్యూలైన్లు, మాడ వీధుల్లో భక్తులకు మజ్జిగ, తాగునీరు పంపిణీ చేశారు.



క్యూలైన్‌లో భక్తులకు తాగునీరు పంపిణీ చేస్తున్న ఆలయ ఉద్యోగులు